యథేచ్ఛగా విద్యుత్ చౌర్యం?

మీటర్లు, అనుమతులు లేకుండానే ఇళ్లకు కరెంటు

- విద్యుత్ పంపిణీ సంస్థకు భారీ స్థాయిలో నష్టం
- అధికారుల తీరుపై సర్వత్రా నిరసన



చౌదరిగూడలో విద్యుత్ అక్రమంగా వినియోగిస్తున్న ఇళ్లు



అగ్రికల్చర్ లైన్‌లోని హెచ్‌టీ/ఎల్‌టీ తీగల కింది నుంచి అక్రమంగా..

శంషాబాద్ రూరల్: క్షేత్రస్థాయి సిబ్బంది చేతివాటం... అధికారుల ఉదాసీన వైఖరితో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్)కు నష్టం వాటిల్లుతోంది. భారీగా ఇళ్లు, నిర్మాణాలకు అనధికారికంగా విద్యుత్‌ని వినియోగిస్తున్నా పట్టించుకునేవారే లేరనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- శంషాబాద్ మండల పరిధిలోని చౌదరిగూడ శివారులో ఉన్న కాలనీల్లోని కొందరు ఇళ్ల యజమానులు ఎలాంటి అనుమతులు, మీటర్లు లేకుండానే కరెంటును వినియోగిస్తున్నారు. ఇక్కడి అక్రమాలు తెలిసినా సంబంధిత అధికారులు కళ్లు మూసుకుని వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో సిబ్బందికి కాసుల వర్షం కురుస్తుందనే ఆరోపణలూ లేకపోలేదు.

అనుమతులు జాన్తానై..

చౌదరిగూడ శివారులో సుమారు ఐదేళ్ల క్రితం కొత్తగా వెంచర్లు వెలిశాయి. మూసా కాలనీ, డాక్టర్ కాలనీ, ఆఫీసర్స్ కాలనీ, టీచర్స్ కాలనీ, డైమండ్ సిటీ-1, డైమండ్ సిటీ-2, ఎన్‌ఆర్‌ఐ కాలనీల పేరుతో దాదాపు 200 ఎకరాల్లో లేఅవుట్‌లను ఏర్పాటు చేశారు. ఇందులో పాతబస్తీకి చెందిన పేద, మధ్య తరగతి ప్రజలు ప్లాట్లను కొనుగోలు చేశారు.

- కొంత కాలంగా ఆయా కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఇటీవల నిర్మాణాలు జోరందుకున్నాయి. ఇదిలా ఉండగా.. జీఓ 111 పరిధిలో వెలిసిన ఈ వెంచర్లకు ఎలాంటి అనుమతులు లేవు. నిర్మాణాలకు సైతం పంచాయతీ నుంచి అనుమతులు జారీ చేయడం లేదు. ఇదే తరహాల్లో ఇక్కడ అక్రమ విద్యుత్ కనెక్షన్లు వందల సంఖ్యలో ఉన్నాయి. గతంలో నిర్మాణాలు పూర్తి చేసిన వాటితో పాటు నిర్మాణ పనులు జరుగుతున్న ఇళ్లకు అక్రమంగా కరెంటు వాడుతున్నారు.

ప్రమాదకరంగా తీగలు..

వెంచర్ల ఏర్పాటు సమయంలో ఇళ్ల అవసరాల కోసం రియల్టర్లు గతంలో అక్కడ రెండు 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేశారు. వీటి నుంచి కొన్ని ఇళ్లకు మాత్రమే విద్యుత్ సరఫరా ఉంది. మిగిలిన ఇళ్లు, నిర్మాణాలకు ఇక్కడి నుంచి కరెంటు సరఫరా సాధ్యం కాకపోవడంతో వారంతా..



అగ్రికల్చర్ లైన్ నుంచి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారు.

- చౌదరిగూడ పాత ట్రాన్స్‌ఫార్మర్, ఎర్రకుంట్ల ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నేరుగా న్యూట్రల్‌ను, ఎల్‌టీ లైన్ నుంచి సింగిల్ ఫేజ్ కరెంటును కలిపి వాడుకుంటున్నారు. ఇందు కోసం ఆయా కాలనీల మీదుగా ఉన్న అగ్రికల్చర్ హెచ్‌టీ/ఎల్‌టీ లైన్ స్తంభాలకు పెద్ద ఎత్తున కేబుళ్లను ఏర్పాటు చేస్తుండడంతో ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడైనా కరెంటు సరఫరాలో అంతరాయం కల్గినా.. ఏదైనా సమస్య తలెత్తినా.. ఆన్, ఆఫ్ సిస్టమ్ లేకపోవడంతో ప్రమాదాల నివారణకు తీవ్ర ఆటంకాలు ఏర్పడే అవకాశాలు లేకపోలేదు.

డైరెక్ట్ కనెక్షన్.. నో యాక్షన్...

ఆయా కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు, ఇళ్లకు కరెంటును అక్రమంగా వినియోగిస్తున్నారు. ఇందు కోసం వ్యవసాయ భూముల కోసం ఏర్పాటు చేసిన అగ్రికల్చర్ ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి కరెంటును చోరీ చేస్తున్నారు.

- ఈ ప్రాంతంలో రెండు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉన్నాయి. వీటి నుంచి త్రీ ఫేజ్ కరెంటు సరఫరా ఉంటుంది. అయితే ఇళ్లకు కావాల్సిన సింగిల్ ఫేజ్ కరెంటు కోసం ఇళ్ల యజమానులు అడ్డదారులు వెతుక్కుంటున్నారు. అగ్రికల్చర్ లైన్ నుంచి ప్రత్యేకంగా కేబుల్‌ను ఏర్పాటు చేసుకుని ఇళ్లకు కరెంటును సరఫరా చేసుకుంటున్నారు.
- ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి న్యూట్రల్ లైన్ ఏర్పాటుకు 20 మీటర్ల నుంచి 500 మీటర్ల వరకు కేబుల్‌ను స్తంభాల ద్వారా తీసుకెళ్తున్నారు. సమీపంలో ఉన్న ఎల్‌టీ లైన్ నుంచి కొక్కేలు వేసి విద్యుత్‌ను వినియోగించుకుంటున్నారు.

లోడ్ ఎక్కువై కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు...

ఇక్కడ ఉన్న అగ్రికల్చర్ ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి కాలనీల్లోకి ఇళ్లకు అక్రమంగా కరెంటు వాడుతుండటంతో వాటిపై భారం పెరిగిపోతోంది. ఈ ప్రాంతంలో సాగు విస్తీర్ణం రోజు రోజుకు తగ్గిపోతున్నా కరెంటు వినియోగం పెరుగుతూనే ఉంది. సమృద్ధిగా వానలు కురవడంతో రెండు నెలలుగా పొలాల్లోని బోరు మోటార్లు నడపడంలేదు. అయినా ఈ ప్రాంతంలో ఉన్న రెండు అగ్రికల్చర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మూడు నెలల్లో రెండు సార్లు కాలిపోయాయి. వీటికి గల కారణాలను అధికారులు పరిగణలోకి తీసుకోకపోవడంతో అనధికార కనెక్షన్లకు అడ్డుకట్ట పడటంలేదు. ఇది ఓ రకంగా క్షేత్ర స్థాయి సిబ్బందికి కాసుల వర్షం కురిపిస్తోందనడం అక్షర సత్యం.

కంచ ఐలయ్యకు సత్కారం



ప్రొఫెసర్ ఐలయ్యను సన్మానిస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: ప్రొఫెసర్ కంచ ఐలయ్య జన్మదినాన్ని పురస్కరించుకొని రాజేంద్రనగర్‌లోని వెటర్నరీ కళాశాలలో ప్రొఫెసర్ రామ్ సింగ్ ఆదివారం ఉదయం ఆయనను కలిసి ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాంసింగ్ స్వయంగా వేసిన కంచ ఐలయ్య చిత్రపటాన్ని ఆయనకు బహూకరించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రతాప్ దేవరకొండ, ప్రొఫెసర్ సునీల్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



రాజేంద్రనగర్: బుద్వేల్ కట్ట మైసమ్మ దేవాలయం ఆవరణలో ఆదివారం రాత్రి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి సంవత్సరం దేవీ నవరాత్రి ఉత్సవాల అనంతరం వచ్చే ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులు అందజేసే ఒడి బియ్యాన్ని అన్నదాన కార్యక్రమంలో ఉపయోగిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున అమ్మవారికి ప్రత్యేక అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఆలయ ఆవరణలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

'యూత్ క్లబ్' అధ్యక్షుడికి సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న దళిత సంఘాల నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మంగళారం శ్రీనివాస్‌ను ఆదివారం ఉదయం దళిత సంఘాల నేతలు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నవజ్యోతి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో అనేక సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు యువకులకు క్రీడా పోటీలు నిర్వహించాలని ఆకాంక్షించారు. దళిత రత్న అవార్డు గ్రహీత పత్యార నరసింహ, అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రామ్ జయంతి మాజీ అధ్యక్షుడు పంబాల రాజు, అంబేడ్కర్ సంఘం ప్రెసిడెంట్ గొడుగు సంజీవ, ఆవుల సుధీర్, మేఘనాథ్, నాని, కార్తీక్, ప్రీతంరాజ్, నవీన్ వీర్లపల్లి తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోయిన చెత్త కుప్పలు



మోతీమహల్ చౌరస్తా వద్ద..

గోల్కొండ: కార్వాన్ నియోజవర్గంలోని గుడిమల్కాపూర్, కార్వాన్ ప్రధాన రహదారులపై పేరుకుపోయిన చెత్త కుప్పలు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. అదే విధంగా మోతీమహల్ చౌరస్తా, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లో సైతం పారిశుద్ధ్య పనులు అటకెక్కడంతో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి.

ముమ్మరంగా డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు

బంజారాహిల్స్: వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పోలీసులు శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు 3 గంటల పాటు 9 చోట్ల డ్రంకన్ డ్రైవ్‌లు నిర్వహించారు. మోతాదుకు మించి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 92 మందిని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ట్రాఫిక్ డీసీపీ రాహుల్‌హెగ్డే, అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి, వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ డ్రంకన్ డ్రైవ్‌ను పరిశీలించారు. బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి.సాయిప్రకాశ్‌గౌడ్, పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సంజీవ్ పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలపై ..

నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపడంతో పాటు ట్యాంపరింగ్ చేసి నడుపుతున్న వారిపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. నగర సీపీ సజ్జనార్ ఆదేశాల మేరకు ఆదివారం పంజగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో సిబ్బందితో పాటు ప్రత్యేక బృందాలు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించారు. సరైన నంబర్ ప్లేట్ లేని వాహనదారులపై కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానా విధించారు.

'కోట' కిటకిట



గోల్కొండ: పర్యాటక ప్రాంతమైన గోల్కొండ కోట ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో ఉదయం 7 గంటల నుంచే వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు గోల్కొండ కోటకు చేరుకున్నారు. పెద్ద ఎత్తున వచ్చిన పర్యాటకులతో రాందేవ్‌గూడ, గోల్కొండ కోట చౌరస్తా, బాలాహిసార్ చౌరస్తా తదితర ప్రాంతాలు పర్యాటకులతో నిండిపోయాయి. కోటలోని ఆయుధాగారం, అక్కన్న మాదన్న కార్యాలయం, రామదాసు బందీఖానా తదితర చారిత్రక ప్రదేశాలను పర్యాటకులు ఎంతో ఆసక్తితో తిలకించారు. విశాలమైన కోట గోడల వద్ద యువజంటలు సెల్ఫీలు దిగారు.

అలీజాపూర్‌లో శ్మశానవాటికకు స్థలం కేటాయింపు

గోల్కొండ: కుతుబ్‌షాహీ ఈద్గా అలీజాపూర్‌లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ముస్లిం శ్మశానవాటిక ఏర్పాటు కేటాయించారని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మత్ ఉల్లా హుస్సేనీతో కలిసి అలీజాపూర్‌లోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ జూబ్లీహిల్స్ నియోకవర్గంలో ఖాళీగా ఉన్న స్థలాలను శ్మశానవాటికలకు కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరారన్నారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులకు స్థలం కేటాయింపుపై ఆదేశాలు ఇచ్చారన్నారు. అలీజాపూర్‌లో ఎకరం ఐదు గుంటలు స్థలం ఖాళీగా ఉందని అన్ని అనుమతులు పొందిన తర్వాత ముస్లిం శ్మశానవాటికగా తీర్చిదిద్దుతామన్నారు. కార్పొరేటర్లు మహ్మద్ రాషేద్ ఫరాజుద్దీన్, మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు ఆరూన్ ఫరాన్, ఆలీముద్దీన్, షకీల్ ఆలీఖాన్, పాషాభాయ్, ముస్తాఫా తదితరులున్నారు.

విధుల్లో చేరిన వైద్యులు

సాక్షి ఎఫెక్ట్..

మణికొండ: ప్రభుత్వం ద్వారా పేదలకు వైద్య సేవలు అందిస్తున్న బస్తీ దవాఖానాల్లో డాక్టర్లు లేక రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఇటీవల 'సాక్షి' దినపత్రికలో 'అందని వైద్య సేవలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై ప్రభుత్వం స్పందించింది. గండిపేట మండల పరిధిలోని నార్సింగి, మణికొండ, బండ్లగూడల్లో డాక్టర్లు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని కథనంలో వివరించింది. స్పందించిన ప్రభుత్వం ముందుగా నార్సింగి, మణికొండలకు ఇద్దరు వైద్యులను కేటాయించిందని, బండ్లగూడకు వారం రోజుల్లో వచ్చే అవకాశం ఉందని మండల వైద్యాధికారి సత్య రత్న తెలిపారు. మణికొండకు కేటాయించిన డాక్టర్ ఆఫ్రిన్‌కు వైద్య సిబ్బందితోపాటు స్థానికులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ మహిళా అధ్యక్షురాలు బి.ఇందిరా రాంరెడ్డి మాట్లాడుతూ... పేదలకు సకాలంలో వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో అన్ని బస్తీ దవాఖానల్లో రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్‌లను నియమిస్తుందన్నారు. వారి ద్వార పేదలకు సత్వర సేవలు అందుతున్నాయన్నారు. డాక్టర్‌ల నియామకం విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన 'సాక్షి'కి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభావతి, నరేందర్, అశ్విన్ పాల్గొన్నారు.



మణికొండలో విధుల్లో చేరిన డాక్టర్‌కు స్వాగతం పలుకుతున్న స్థానికులు

పోగొట్టుకున్న పాస్‌పోర్టు ప్రయాణికుడికి అందజేత



ప్రయాణికుడికి పాస్‌పోర్టు అందజేస్తున్న ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీసులు

శంషాబాద్: ప్రయాణికుడు పోగొట్టుకున్న పాస్‌పోర్టును ఆర్‌జీఐఏ పోలీస్ ఔట్‌పోస్టు పోలీసులు సత్వరమే వెతికి అతనికి అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆదివారం రాత్రి విదేశాల నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడు అరైవల్ సందర్భంలో తన పాస్‌పోర్టును పోగొట్టుకున్నాడు. వెంటనే అతడు ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు తక్షణమే స్పందించి సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. ఆయన పోగొట్టుకున్న పాస్‌పోర్టును గుర్తించి ఫిర్యాదుదారుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుడు ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీస్‌స్టేషన్ పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. ఎస్‌ఐలు హారిక, రోహిత్, ఏఎస్‌ఐ శంకర్‌లను ఇన్‌స్పెక్టర్ అభినందించారు. ప్రయాణికుల సమస్యల సత్వర పరిష్కారానికి ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీసులు వేగంగా స్పందిస్తారని ఆయన తెలిపారు.

వెంకటస్వామికి ఘనంగా నివాళి



నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

రాజేంద్రనగర్: మాజీ మంత్రి కాకా వెంకట్‌స్వామి జయంతిని దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం రాజేంద్రనగర్ చౌరస్తాలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కాకా వెంకటస్వామి చేసిన సేవలు కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల కోసం అనుక్షణం తపిస్తూ హక్కుల సాధన కోసం పోరాడినట్లు పలువురు గుర్తుచేశారు. గల్లీ నాయకుడి తన ప్రస్థానాన్ని ప్రారంభించి కాకా కేంద్ర మంత్రివర్గంలో పని చేసిన తనకంటూ గొప్ప పేరు ప్రతిష్టలను సంపాదించుకున్నారన్నారు. దళిత సంఘాల నాయకులు ప్రత్యర నరసింహ, గొడుగు సంజీవ, పంబల రాజు, మంత్రి చంద్రశేఖర్, ఎస్‌జేవైసీ ప్రెసిడెంగ్, దళిత సంఘాల నాయకులు మంగళారం శ్రీనివాస్, పత్యార రాజు, ఎస్.పెంటయ్య, పచ్చ నర్సింగ్ రావు, ముడిమాల శ్రీకాంత సంజు, కొత్తపల్లి సంతోష్, శ్రీకాంత్, బుద్దు, పలు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



మాదాపూర్: దసరా ఉత్సవాల్లో భాగంగా శిల్పారామంలో ఆదివారం బెంగుళూరుకు చెందిన భరతనాట్య కళాకారులు అమృత శేషాంక్ శిష్య బృందం భరతనాట్య ప్రదర్శనతో అలరించారు. పుష్పాంజలి, శ్లోక, దుర్గకృతి, రుక్మిణీ కౌతం, శ్లోకాంజలి, వర్ణం, దేవార్ణమా, శారదాస్తుతి, రవాణాస్తోత్రం, మంగళం తదితర అంశాలను అమృత శేషాంక్, భార్గవి, కృతిక, వైష్ణవి, లిషిత, సానిక, శ్రేయ, మార్ఘులిని, గాయత్రి, అనికా, లితిక్ష, కారుణ్య ప్రదర్శించారు. అలాగే చేనేత, హస్త కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకున్నాయి. నగరవాసులు గృహాలంకరణ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ బలోపేతం

గోల్కొండ: తెలంగాణలో కాంగ్రెస్ ఎంతో బలిష్టంగా ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కురాకుల కృష్ణ ఆదివారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును రాష్ట్ర ప్రజలు ఏకగ్రీవంగా ఆమోద ముద్ర వేస్తున్నారన్నారు. అయితే కాంగ్రెస్‌కు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి రాష్ట్రంలోని ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆయన అన్నారు. ఆయనను కలిసిన వారిలో వెంకట్‌రెడ్డి, జయరాంరెడ్డి తదితరులున్నారు.

'ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తాం'



మిలట్రీ అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ ఫరాజ్ తదితరులు

గోల్కొండ: అలీజాపూర్‌లో తమ ఆధీనంలో ఉన్న స్థలాన్ని ఎవరికీ అప్పగించమని గోల్కొండ ఆర్టిలరీ అధికారులు స్పష్టం చేశారు. ఆదివారం అలీజాపూర్‌లోని 1.05 ఎకరాల స్థలం ప్రభుత్వానిదని తేలడంతో మజ్లిస్ నాయకులు ఆ స్థలానికి చేరుకున్నారు. అంతకు ముందే ఆ స్థలాన్ని బల్దియా వారు చదును చేసి ఉంచారు. అయితే అక్కడ విధి నిర్వహణలో ఉన్న మిలట్రీ జవాన్లు, హవల్‌దార్‌లు ఈ స్థలం తమదే అంటూ స్పష్టం చేశారు. పై అధికారుల నుంచి ఈ స్థలంపై తమకు ఎటువంటి ఆదేశాలు రాలేదని అధికారుల ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తామని అక్కడ ఉన్న వారు కార్పొరేటర్ ఫరాజ్‌కు స్పష్టం చేశారు.

'సంక్షేమం'తో బీజేపీ వైపు యువత చూపు

గచ్చిబౌలి: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. మసీదుబండలోని పార్టీ కార్యాలయంలో కూకట్‌పల్లి, హాఫిజ్‌పేట్ డివిజన్ల నుంచి డివిజన్ కోశాధికారి విజయ్‌కుమార్, బీజేవైఎం నాయకులు వీరేశ్ యాదవ్ ఆధ్వర్యంలో రవికుమార్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు బాలుయాదవ్ సమక్షంలో ఆదివారం పలువురు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీలో అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ప్రతిఒక్కరూ కష్టపడితేనే విజయం దరి చేరుతుందని ఆ దిశగా ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు భూపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, కవిత, పవన్, పార్టీలో చేరిన వారు ప్రేమ్, కార్తీక్, హరీశ్, శేఖర్, ప్రేమ్, శివ, భాను, వంశీ, యశ్వంత్, వినయ్, రాము, చందు, విక్కీ, సాయిప్రణవ్, నవీన్ పాల్గొన్నారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మణికొండ: వారంతా రెండు దశాబ్దాల క్రితం కలిసి ఒకే పాఠశాలలో చదువుకున్నారు. ఆదివారం వారంతా ఒక చోట కలిసి అపుడు తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను సన్మానించుకున్నారు. వారి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990-91వ సంవత్సరంలో చదువుకున్న అప్పటి విద్యార్థులంతా ఆదివారం నార్సింగిలోని కేవీఎంఆర్ గార్డన్స్‌లో సమావేశమయ్యారు. ఒకరికొకరు యోగ క్షేమాలు, కుటుంబాలు, చేస్తున్న పనుల గురించి చర్చించుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, సీతాబాయిలను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు వేణుకుమార్, వెంకటేష్, విజయ్‌కుమార్, వెంకట్ రాంరెడ్డి, గిరిధర్‌రెడ్డి, సురేష్, సుమతి, భారతిబాయి, అనిత, లక్ష్మీలతో పాటు అప్పటి విద్యార్థులంతా పాల్గొన్నారు.



నార్సింగిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఎమ్మార్పీఎస్‌ను మరింత బలోపేతం చేస్తాం



ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గ సభ్యులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మండల పరిధిలోని ప్రతి కాలనీ, బస్తీలకు చెందిన ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలను నియమిస్తూ ఎమ్మార్పీఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర నాయకులు పోతురాజు యాదన్న, నాన్నగారి రామచందర్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ వెంకటేశ్వర కాలనీ, నేతాజీనగర్, శ్రీరామనగర్ కాలనీలను కలుపుతూ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా కథలు వెంకట రమణ, ప్రధాన కార్యదర్శిగా బోటుకుల కరణ్, సంయుక్త కార్యదర్శిగా గజాభాగా నరేశ్, ఉపాధ్యక్షులుగా కిన్నింటి రాజు తదితరులు నియమించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారాన్ని చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఎమ్మార్పీఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు మందకృష్ణ మాదిగ ఆదేశం మేరకు కొత్త కమిటీలను నియమించామన్నారు. కమిటీ సభ్యులంతా అందరిని సమన్వయం చేసుకుంటూ బలోపేతం చేయాలని సూచించారు. నేతలు ఆవునూరి బాబురావు, చెరుకూరి మన్యం, లింగని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఖరీదైన బంగారు బ్రాస్‌లెట్ పోగొట్టుకున్న ప్రయాణికురాలు

అప్పగించిన సీఐఎస్‌ఎఫ్ అధికారులు

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయం నుంచి రాంచీకి వెళ్లేందుకు వచ్చిన ఓ ప్రయాణికురాలు పోగొట్టుకున్న ఖరీదైన బంగారు బ్రాస్‌లెట్‌ను సీఐఎస్‌ఎఫ్ అధికారుల గుర్తించి బాధితురాలికి అప్పగించారు. వివరాలివీ... శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఇండిగో విమానంలో రాంచి వెళ్లేందుకు వచ్చింది. ప్రయాణ హడావిడిలో కగారుగా ఉన్న ఆమె తన దగ్గర ఉన్న రూ. మూడు లక్షల విలువైన బంగారు బ్రాస్‌లెట్‌ను పోగొట్టుకుంది. గుర్తించిన ఆమె వెంటనే అధికారులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందిన వెంటనే సీసీ టీవీ ఫుటేజీల ద్వారా పరిశీలించిన సీఐఎస్‌ఎఫ్ అధికారులు ఎయిర్ పోర్టుకు చెందిన ఉద్యోగి మహ్మద్ దానిని తన పాకెట్‌లో వేసుకున్నట్లు గుర్తించి అతడి నుంచి స్వాధీనం చేసుకుని ప్రయాణికురాలికి అప్పగించారు.

విమానం దారి మళ్లింపు...

హైదరాబాద్ నుంచి దర్‌భంగా వెళ్లాల్సిన విమానం దారి మళ్లించారు. దర్‌భంగా విమానాశ్రయంలో దర్‌భంగా విమానాశ్రయంలో ఉన్న సాంకేతిక సమస్యల కారణంగా దానిని వారణాసికి మళ్లించినట్లు అధికారులు తెలిపారు.

7 రోజులు.. 416 మంది మందుబాబులు

'ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవింగ్' లో అదుపులోకి

రాయదుర్గం: సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 4 వరకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల 'వీకెండ్-స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవింగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో 416 మంది మందుబాబులను అదుపులోకి తీసుకున్నారు. వారిని కోర్టులో హాజరుపర్చామని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు. ఇందులో 51 డీడీ కేసులను న్యాయస్థానాలు పరిష్కరించాయి. 45 మందికి జరిమానా విధించగా మరో ఆరుగురికి జైలు శిక్ష విధించారు. వారిలో ఒకరోజు శిక్షను నలుగురికి, 2 రోజుల శిక్షను ఇద్దరికి విధించారు. కాగా మరో ఐదుగురికి జరిమానాలో భాగంగా సామాజిక సేవ కేటాయించిందని పోలీసులు తెలిపారు.